నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I హైదరాబాద్, సోమవారం 14 అక్టోబర్ 2024 VIKARABAD



## కొడంగల్‌లో సీఎం సందడి

కొడంగల్, అక్టోబర్ 13 : దసరా ఉత్సవాన్ని పురస్కరించుకొని సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. శనివారం రాత్రి కొడంగల్‌కు చేరుకున్న ఆయన.. ఆదివారం తన నివాసంలో నియోజకవర్గ ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, అధికారులతో కలిసి పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు తిరిగి వెళ్లిపోయారు.

## కొత్త కారిడార్‌పై మెట్రో అధికారుల కసరత్తు



ఉత్తర హైదరాబాద్ లక్ష్యంగా
కొత్త రూట్‌లను పరిశీలించనున్న అధికారులు

సిటీబ్యూరో, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): ఔటర్ రింగు రోడ్డును దాటి హైదరాబాద్ మహానగరం విస్తరిస్తున్నది. గత కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న చొరవతో నగరం నలుదిక్కులా అభివృద్ధికి నోచుకున్నది. దాని ఫలితంగానే నివాస గృహాలతో పాటు పరిశ్రమలు, వ్యాపార, వాణిజ్య కేంద్రాలు అన్ని వైపులా ఏర్పాటయ్యాయి. నగర శివారు ప్రాంతాల అభివృద్ధికి అనుగుణంగా ప్రజా రవాణా వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నది. అయితే కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మెట్రో రెండో దశను ప్రతిపాదించి డీపీఆర్(సమగ్ర ప్రాజెక్టు నివేదిక)లు రూపొందించినా, అవి కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యాయి. ప్రధానంగా వెస్ట్, సౌత్, ఈస్ట్ హైదరాబాద్‌ల వైపు కొన్ని మార్గాలను ప్రతిపాదించినా, నార్త్ (ఉత్తర) హైదరాబాద్ వైపు మాత్రం ఒక్క మార్గాన్ని కూడా రెండో దశలో ప్రతిపాదించలేదు. దీనిపై గత కొన్ని నెలలుగా పెద్ద ఎత్తున ఉత్తర హైదరాబాద్ ప్రాంతాల వాసులంతా ఒక్కటై ఆందోళనకు సిద్ధం కాగా, వారికి ప్రజాప్రతినిధులు సైతం మద్దతుగా నిలిచారు. మరోవైపు హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ రెండో దశ మెట్రోకు సంబంధించిన 5 మార్గాల్లో సుమారు 76.2 కి.మీ మేర మెట్రోను నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయడంతో పాటు డీపీఆర్‌లను సమర్పించారు.

### కొత్త మార్గాలపై అధ్యయనం...

మెట్రో రెండో దశ మార్గాలు ఖరారైనా, నగరంలో ఇంకా కొన్ని ప్రాంతాలకు మెట్రోను నిర్మించాలన్న డిమాండ్ బాగా పెరగడంతో వాటిని తరువాత దశలో చేపట్టే దిశగా అధ్యయనం చేపట్టనున్నారు. ముఖ్యంగా సికింద్రాబాద్ ప్రాంతం నుంచి ఔటర్ రింగు రోడ్డు వరకు ఉన్న వివిధ ప్రాంతాలను పరిగణనలోకి తీసుకొని అధికారులు ఆయా మార్గాలను పరిశీలించనున్నారు. ఇందులో ప్రధానంగా తార్నాక-ఈసీఐఎల్-కీసర, సికింద్రాబాద్ ప్యాట్నీ-అల్వాల్ మీదుగా శామీర్‌పేట, సికింద్రాబాద్ ప్యారడైజ్ నుంచి బోయిన్‌పల్లి మీదుగా మేడ్చల్ కండ్లకోయ వరకు ఉన్న మార్గాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి ట్రాఫిక్, ప్రయాణికుల రద్దీ వంటి అంశాలపై అధ్యయనం చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న జీహెచ్‌ఎంసీ పరిధిని ఔటర్ రింగు రోడ్డు వరకు విస్తరిస్తున్న నేపథ్యంలో కోర్ సిటీ నుంచి నగరం నలుమూలలా మెరుగైన ప్రజా రవాణా వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఈ అధ్యయనాన్ని చేపట్టనున్నట్టు తెలిసింది.

ఎన్నికలకు ముందు ఓ మాట.. అధికారంలోకి వచ్చాక మరోమాట
- సన్నాలకే బోనస్ అంటూ కాంగ్రెస్ సర్కార్ మాయ మాటలు
- దొడ్డు రకానికి బోనస్ లేకపోవడంతో రైతులకు తీవ్ర నష్టం
- కొర్రీలతో సన్నాల విషయంలోనూ ప్రభుత్వం మోసం
- జిల్లాలో 27,425 ఎకరాల్లో దొడ్డు రకం, 1,01,355 ఎకరాల్లో సన్నరకం సాగు
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై జిల్లా రైతాంగం ఆగ్రహం



# బోనస్..బోగస్!

**వరికి బోనస్ కల్పించే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం మరోమారు రైతులను మోసం చేస్తున్నది. అన్ని రకాల వడ్లకు మద్దతు ధరపై క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన రేవంత్... అధికారంలోకి వచ్చాక నాలుక మడతేశాడు. సన్నాలకే బోనస్ ఇస్తామని చెప్పడంతో జిల్లా రైతాంగం తీవ్ర నిరాశకు గురవుతున్నది. జిల్లాలో 27,425 ఎకరాల్లో దొడ్డు రకం వరిని, 1,01,355 ఎకరాల్లో సన్నరకం వరిని రైతాంగం సాగు చేసింది. సన్నాలకే బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో దొడ్డు రకం సాగు చేసిన రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నది. అలాగే.. సన్నరకం ధాన్యం కొనుగోళ్లలోనూ ప్రభుత్వం అనేక కొర్రీలు పెడుతుండడంతో బోనస్ దక్కుతుందో ? లేదో ! అని రైతాంగం ఆందోళన చెందుతున్నది.**

**- రంగారెడ్డి, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ)**

### సన్నాలకు గింజను కొలిచి.. బోనస్ ఇస్తారట..

గింజను కొలిచి బోనస్ ఇచ్చేలా ప్రభుత్వం కొత్త నిబంధనను అమలులోకి తేనుండడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. చిన్నచిన్న వస్తువుల పొడువు, వెడల్పు కొలతలను లెక్కించడం కోసం వినియోగించే కాలిపర్స్ పరికరాన్ని సన్నధాన్యాన్ని గుర్తించేందుకు వినియోగించనున్నారు. ఇందుకు పౌరసరఫరాల శాఖ ఇప్పటికే భారీ సంఖ్యలో కాలిపర్స్ పరికరాలను కొనుగోలు చేసేందుకు నిర్ణయించినట్లు తెలిసింది. ప్రతి కొనుగోలు కేంద్రానికి కనీసం రెండు చొప్పున పరికరాలను ఇవ్వనున్నట్లు తెలుస్తున్నది. కొనుగోలు కేంద్రానికి రైతులు తెచ్చే ధాన్యంలో కొన్ని గింజలను సేకరించి పొట్టు తీశాక బియ్యం గింజను కాలిపర్స్ ద్వారా కొలతేస్తారు. ఈ కొలతలో బియ్యం గింజ పొడవు 6 మిల్లీమీటర్ల కన్నా తక్కువగా ఉండాలి. వెడల్పు మిల్లీమీటరుకు మించొద్దు. బియ్యపు గింజ పొడవు, వెడల్పుల నిష్పత్తి 2.5 మిల్లీమీటర్ల కన్నా ఎక్కువగా ఉండాలి. కాలిపర్స్‌లో పెట్టిన బియ్యపు గింజ ఈ కొలతలకు సరిపోతేనే దాన్ని సన్నధాన్యంగా పరిగణిస్తారు. ఆ ధాన్యానికే రూ.500 బోనస్‌ను ప్రభుత్వం చెల్లించనున్నది.

### బోనస్ ఎగ్గొట్టేందుకేనా!

బోనస్‌ను ఎగ్గొట్టి ఆర్థిక భారాన్ని తగ్గించేందుకే ప్రభుత్వం కొర్రీలు పెడుతున్నదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సన్నరకం ధాన్యాలు ఏమిటన్న దానిపై ప్రభుత్వం ఇప్పటికే స్పష్టత ఇచ్చింది. బీపీటీ-5202 తోపాటు ఆర్‌ఎన్‌ఆర్, హెచ్‌ఎంటీ సోనా, జైశ్రీరాం రకాలతో పాటు మరో 33 రకాలను సన్న ధాన్యంగా పరిగణించాలని ప్రభుత్వం సూచించింది. ఈ 37 రకాల్లో రంగారెడ్డి జిల్లాలో పండించేది ఐదు నుంచి ఆరు రకాలు ఉంటాయి. అలాంటప్పుడు ఈ కొలతలు దేనికని రైతులు ప్రశ్నిస్తున్నారు. వ్యవసాయ శాఖ సన్నాల కింద ప్రకటించిన జాబితాలో రైతు పండించిన ధాన్యం ఉన్నా.. కొలతల్లో తేడా వస్తే దొడ్డు కింద పరిగణిస్తే.. ఎలాగని రైతులు పేర్కొంటున్నారు. ఒక్కో వ్యవసాయ క్షేత్రంలో భూసారాన్ని బట్టి గింజ పరిమాణంలో తేడా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. కొలతల పేరుతో కొర్రీలు పెట్టి బోగస్ ఎగ్గొట్టేందుకే ఈ కొత్త నిబంధనను ప్రభుత్వం తెరపైకి తెస్తున్నదని రైతులు ఆరోపిస్తున్నారు.

### సన్నాలు ఇక ప్రైవేటుకేనా..

ఓపెన్ మార్కెట్‌లో సన్నాలకు మంచి ధర ఉంటుండడంతో సదరు ధాన్యం ప్రైవేటుకు వెళ్లే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని రైతు సంఘాల నేతలు పేర్కొంటున్నారు. ప్రభుత్వం క్వింటాలుకు 2,300 మద్దతు ధర ఇస్తున్నది. 'ఏ' గ్రేడ్‌కు రూ.2,320 చెల్లిస్తున్నది. ఈ లెక్కన సన్నాలు విక్రయిస్తే.. బోనస్ రూ.500లతో కలిపి క్వింటాలుకు రూ.2,820 గరిష్ఠంగా వస్తాయని, అదే బయట మార్కెట్లో అయితే మరింత ఎక్కువ ధర పలికే అవకాశం ఉన్నదని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం సన్నాలకు మార్కెట్‌లో రూ.2,700 నుంచి రూ.2,800 వరకు ధర పలుకుతున్నది. ఈ ధర రానున్న రోజుల్లో మరింతగా పెరిగే అవకాశం ఉన్నదని రైతులు అంటున్నారు. దీంతో మెజార్టీ రైతులు బహిరంగ మార్కెట్‌లో సన్నరకం వరి ధాన్యాన్ని విక్రయించే అవకాశాలు ఉంటాయని మార్కెట్ నిపుణులు సైతం పేర్కొంటున్నారు. బోనస్ ప్రకటన వల్ల జిల్లా రైతులకు పెద్దగా ప్రయోజనం చేకూరదని, పైగా దొడ్డురకం వరి వెరైటీని సాగు చేసిన రైతులకు నష్టం కలుగుతున్నదని రైతాంగం వాపోతున్నది.

## ఎక్కడ చూసినా మద్యమే!



- వికారాబాద్ జిల్లావ్యాప్తంగా 2 వేలకుపైగా బెల్టు షాపులు
- కిరాణా దుకాణాల్లోనే కొనసాగుతున్న వైనం
- తాగునీరు దొరకదేమోగాని.. మద్యం మాత్రం గ్యారెంటీ
- ఆగమవుతున్న పేదల బతుకులు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎక్సైజ్, పోలీసు యంత్రాంగం
- ఫిర్యాదు చేస్తేనే దాడులు

వికారాబాద్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ) : వికారాబాద్ జిల్లాలోని గ్రామాల్లో మద్యం ఏరులై పారుతున్నది. కిరాణా దుకాణాల కంటే ఎక్కువగా మద్యం దుకాణాలున్నాయి. జిల్లాలోని కొడంగల్, తాండూరు ప్రాంతాల్లో వేసవి కాలంలో తాగునీటి కష్టాలు వస్తాయేమో కాని మద్యం మాత్రం ఎక్కడపడితే అక్కడ దొరుకుతుండడం గమనార్హం. మద్యానికి బానిసలై ఎంతోమంది పేదల బతుకులు ఆగమవుతున్నప్పటికీ జిల్లా ఎక్సైజ్, పోలీసు యంత్రాంగం మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. బెల్టు షాపులు ఎక్సైజ్ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతుండడం గమనార్హం. ఎక్సైజ్ శాఖతోపాటు పోలీసులకు ప్రతినెలా మామూళ్లు వస్తుండడంతో బెల్టుషాపుల నిర్వహణను చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. గ్రామాల్లో సారా రక్కసి సమూలంగా పోయినప్పటికీ మద్యం ఏరులై పారుతున్నదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకట్రెండు గ్రామాల్లో మహిళలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సంపూర్ణ మద్యపాన నిషేధం ప్రకటిస్తున్నప్పటికీ మెజార్టీ గ్రామాల్లో మద్యం అమ్మకాలు మాత్రం ఆగడంలేదు. జిల్లాలో గతేడాది 59 మద్యం దుకాణాల్లో 7.77 లక్షల లీటర్ల మద్యం విక్రయాలతో రూ.715 కోట్ల ఆదాయంరాగా.. ఈ ఏడాది ఇప్పటివరకు 3.74 లక్షల లీటర్ల మద్యం విక్రయాలతో రూ.349 కోట్ల ఆదాయం వచ్చింది.

### మామూళ్లు అందడంతో చూసీచూడనట్లు..

జిల్లావ్యాప్తంగా కేవలం 59 లైసెన్స్‌డ్ మద్యం దుకాణాలుండగా.. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహించే బెల్టు షాపులు సుమారు 2 వేలకుపైగా ఉన్నాయి. ఒకటి రెండు మినహా మిగతా కిరాణా దుకాణాల్లోనే బెల్టు షాపులను నిర్వహిస్తున్నారు.



ఆశ్చర్యమేమిటంటే జిల్లా కేంద్రంలోని ఎస్పీ ఆఫీస్‌కు ఎదురుగా ఉన్న కిరాణా దుకాణాల్లో తెల్లవారుజాము నుంచే బహిరంగంగానే మద్యాన్ని విక్రయిస్తున్నారు. ఎక్సైజ్‌తోపాటు పోలీసులకు తెలిసినా మామూళ్లతో సరిపెట్టుకొని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు తీవ్రమైన ఆరోపణలు వస్తున్నాయి. గ్రామాల్లో ఏదైనా సంఘటన జరిగితే తూతూమంత్రంగా తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు తదనంతరం ఎలాంటి కేసులు లేకుండా వదిలేస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. పోలీసు, ఎక్సైజ్ అధికారుల అండదండలతో గ్రామాల్లో యథేచ్ఛగా బెల్టు షాపులు కొనసాగిస్తున్నారు. మరోవైపు బెల్టు షాపుల్లో రూ.20 నుంచి రూ.50 వరకు మద్యంపై అధికంగా వసూలు చేస్తున్నారు. లైసెన్స్‌డ్ మద్యం దుకాణాల ద్వారా 40 శాతం మేర విక్రయాలు జరుగుతుండగా.. బెల్టు షాపుల ద్వారా 60 శాతం మేర జరుగుతుండడం గమనార్హం.

### మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం

గ్రామాల్లో బెల్టు షాపుల నియంత్రణకు అవసరమైన చర్యలు చేపడుతున్నాం. ఎవరూ ఫిర్యాదు చేసినా తప్పనిసరిగా స్పందించి చర్యలు తీసుకుంటాం. ఫిర్యాదు చేస్తే బెల్టు షాపులను మూసివేస్తాం.

– విజయ్‌భాస్కర్‌గౌడ్,
జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్

## దక్షిణ డిస్కంలో.. పూర్తి కాని బదిలీలు



ఉద్యోగుల బదిలీలు ఇలా...

డివిజనల్ ఇంజినీర్లు(డీఈ) -111

అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్లు - 263

అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు - 521

ఇతర కేడర్ ఉద్యోగులు - 231

### ఉద్యోగుల ఎదురుచూపులు

సిటీబ్యూరో, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో ఉద్యోగుల బదిలీ ప్రక్రియ కొలిక్కి రావడంలేదు. దసరా పండుగకు ముందు, ఈ నెల 7 తర్వాతే పూర్తి చేస్తామని ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన అధికారులు వారం రోజులు గడిచినా బదిలీలపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. బదిలీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు మొట్టమొదటిసారిగా వెబ్ కౌన్సెలింగ్ తరహాలో బదిలీలకు సంబంధించి జాబితా రూపొందించింది. ఎంతో కాలంగా బదిలీల కోసం ఎదురు చూస్తున్నామంటూ ఉద్యోగులు వాపోతున్నారు. 7వ తేదీ నాటికి ఎంప్లాయీస్ పోర్టల్ ద్వారా ఆప్షన్స్ స్వీకరించిన డిస్కం ఉన్నతాధికారులు, గడువు ముగిసిన వెంటనే బదిలీ జాబితాను వెబ్ కౌన్సెలింగ్ గడువు పూర్తయిన వెంటనే ఆటో రన్ నిర్వహించి జాబితాను ప్రకటించాల్సి ఉంది. అయినా ఈ విషయంలో స్పష్టత లేదు. ఎంతో పారదర్శకంగా చేస్తున్నామని చెప్పిన డిస్కం ఉన్నతాధికారులు, మార్గదర్శకాలు, గడువు విషయాలను పట్టించుకోకుండా బదిలీల జాబితా విడుదల చేయడంలో తాత్సారం చేస్తుండటంతో ఉద్యోగులు మండిపడుతున్నారు.



ప్రాజెక్టు అలుగు వద్ద పర్యాటకుల సందడి

## ఉల్లాసంగా..ఉత్సాహంగా..

### కోట్‌పల్లి ప్రాజెక్టులో పర్యాటకుల సందడి

ధారూరు, అక్టోబర్ 13 : మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టు వద్ద ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలకు దసరా సెలవులు కావడంతో పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రాజెక్టు నీటిలో బోటింగ్ చేస్తూ ఆహ్లాదంగా గడిపారు. బోటింగ్ చేసే ముందు పర్యాటకులకు రక్షణగా అధికారులు దుస్తులను ఇచ్చారు. కుటుంబ సమేతంగా వచ్చి వనభోజనాలు చేశారు. సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.



బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

## అనంతగిరికి పర్యాటకుల తాకిడి

ప్రత్యేక వాహనాన్ని
ఏర్పాటు చేసిన అటవీ శాఖ

వికారాబాద్, అక్టోబర్ 13 : వికారాబాద్ పట్టణానికి సమీపంలో ఉన్న అనంతగిరి కొండల్లో శ్రీ అనంతపద్మనాభస్వామిని ఆదివారం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, వికారాబాద్ జిల్లాలకు చెందిన భక్తులు దర్శించుకున్నారు. ఇందులో భాగంగా అనంతగిరి అందాలు, పచ్చని కొండలు, స్వచ్ఛమైన ప్రకృతిని ఆస్వాదించారు. అనంతగిరి అడవిలో కుటుంబ సభ్యులు,స్నేహితులతో కలిసి వంటకాలు చేసుకొని సహపంక్తి భోజనాలు చేశారు. వాచ్ టవర్ వద్ద పర్యాటకులు సందడి చేసి అనంతగిరి అందాలను తిలకించారు. వ్యూ పాయింట్, నంది ఘాట్ తదితర ప్రదేశాల్లో ఆనందంగా గడిపారు. ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. పర్యాటకుల కోసం అటవీ శాఖ ద్వారా ఏర్పాటు చేసిన వాహనాన్ని గత రెండు రోజుల క్రితం ప్రారంభించారు. ఈ వాహనంలో 8 మంది పర్యాటకులు కూర్చునే సౌకర్యం కల్పించారు. అడవిలో చూడదగ్గ ప్రదేశాలను చూపించుకొని మళ్లీ తిరిగి తీసుకొస్తుంది. ఈ వాహనంలో ఒక్కొక్కరికి రూ.200లు చొప్పున టికెట్ తీసుకుంటున్నారు. దాదాపు గంట వరకు పర్యాటకులను అటవీ ప్రాంతంలో తిప్పుతారు.

